క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమయానికి హాజరు కావాలని కోరారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ

అనంతగిరి : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కష్టపడి పని చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థి పద్మావతిరెడ్డి నాయకత్వాన్ని కోరుకున్న ప్రజలు తమ అభిమానాన్ని పోలింగ్ రూపంలో తెలిపినట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని, మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో దాతలు, నిర్వాహకులు, మాలధారులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు శుక్రవారం ఉపాధ్యాయుడు కారుమంచి శ్రీనివాసరావు, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదానంలో 500 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, గడ్డం సూర్యారెడ్డి, బర్మావత్ సీతారాంసింగ్, రంగా, నాగరాజు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి మృతి


అన్నెం అంజిరెడ్డి

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు అన్నెం పెద్ద అంజిరెడ్డి (55) అకాల మరణం చెందారు. శుక్రవారం తెల్ల వారుజామున ఆయన శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా స్థానికంగా చికిత్స అందించిన అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వెంకమ్మ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు


వెంకమ్మ మృతదేహంపై కాంగ్రెస్ జెండా కప్పుతున్న పార్టీ నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు గుండెపంగు వెంకమ్మ మృతి పార్టీకి తీరని లోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. హుజూర్‌నగర్‌లో గుండెపోటుతో మృతి చెందిన వెంకమ్మ మృతదేహాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించి పార్టీ జెండా కప్పి, పూలమాల ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్‌కుమార్, నాయకులు ముక్కంటి, ముత్తయ్య, రాము, రవీందర్, రాజేష్, వీరబాబు, మార్కు తదితరులు పాల్గొన్నారు.

మట్టికుండ కనుమరుగు


ఈతచెట్టుకు అమర్చిన ప్లాస్టిక్ బాటిల్

నడిగూడెం : సాధారణంగా గీత కార్మికులు తాటి చెట్టు, ఈత చెట్టు నుంచి మట్టి కుండలో కల్లు తీస్తుంటారు. కానీ రోజురోజుకూ కాలం మారుతుండడంతో మట్టితో చేసిన కుండలు అందుబాటులో లేకపోవడంతో నడిగూడెంలో గీత కార్మికుడు యెలుగూరి చంద్రవాస్ ఈత చెట్టుకు ప్లాస్టిక్ బాటిల్‌ను ఏర్పాటు చేసి కల్లు తీస్తున్నాడు. దీంతో రహదారి వెంట వెళ్తున్న బాటసారులు ఆ ఈత చెట్టువైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

లెక్కల్లో అభ్యర్థులు


చిలుకూరులో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే
- పార్టీల నేతలతో చర్చలు
- ఓట్ల అంచనాలో తలమునకలు

కోదాడ : అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ఘట్టం ముగిసింది. ఓటర్ల తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. ఇక పోటీలో ఉన్న అభ్యర్థులు తమ గెలుపోటములపై పోస్టుమార్టంకు దిగారు. తమ నాయకులు, కార్యకర్తలు ఇచ్చిన సమాచారాన్ని క్రోడీకరించుకొని ఎక్కడ తమకు ఎక్కువ ఓట్లు వచ్చాయి, ఎక్కడ తక్కువ ఓట్లు వచ్చాయని లెక్కలు వేసుకొనే పనిలో తలమునకలవుతున్నారు. శుక్రవారం అన్ని పార్టీల నేతలు తమ తమ కార్యాలయాల్లోనే ఉండి మండల, గ్రామ స్థాయి నేతలతో చర్చలు జరిపారు. కోదాడ నియోజకవర్గంలో వివిధ పార్టీలతో పాటు ఇండిపెండెంట్లతో కలిపి 34 మంది పోటీలో ఉన్నప్పటికీ పోటీ మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల మధ్యే ఉంది. ముఖ్యంగా పోలింగ్ అనంతరం ఈ రెండు పార్టీ అభ్యర్థులు మేము గెలుస్తామంటే మేమే అటూ ధీమాను వ్యక్తం చేస్తున్నారు. 2018 ఎన్నికల కన్నా ఈ ఎన్నికల్లో దాదాపు 4 శాతం పోలింగ్ తగ్గింది. ఇది తమకు కలిసి వచ్చే అంశమని ఇరు పార్టీలు ప్రకటించడం గమనించదగ్గ విషయం.

గాలి వీచిందని కాంగ్రెస్.. పథకాలు గెలిపిస్తాయని బీఆర్‌ఎస్

ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువ ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీచిందని, దీంతో తాము అధిక మెజార్టీతో గెలవబోతున్నామని, ఉమ్మడి జిల్లాలో తమదే అత్యధిక మెజార్టీ కాబోతున్నదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ మాత్రం నియోజకవర్గ వ్యాప్తంగా లక్షా 40 వేల మంది వివిధ పథకాలలో లబ్ధిదారులుగా ఉన్నారని, వారంతా తమ వైపే ఉన్నందున ఈసారి కూడా విజయం తమదేనని అంటున్నారు. ఇక ఎన్నికల ముందు పలువురు ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లోకి చేరడం బీఆర్‌ఎస్‌కు మైనస్‌గా, కాంగ్రెస్‌కు ప్లస్‌గా మారిందనే అభిప్రాయం ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారంలో జనసేన వెనకబాటు

కోదాడ సీటును బీజేపీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఆ పార్టీ అభ్యర్థి కోదాడకు కొత్తకావడంతో పాటు బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకోలేక పోయారు. దీంతో అన్ని గ్రామాల్లో ప్రచారం కూడా నిర్వహించలేక పోయాడనే విమర్శ ఉంది. బీఎస్పీ అభ్యర్థి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేసినా చివరివరకు ఆ ఊపును కొనసాగించలేక పోయాడు. దీంతో అనుకున్న స్థాయిలో పోటీ ఇవ్వలేక పోయాడని పలువురు అంటున్నారు. ఇక సీపీఎం పార్టీది కూడా అదే పరిస్థితి. ఇక ఫార్వర్డ్ బ్లాక్ తరుపున పోటీ చేసిన అంజియాదవ్ మాత్రం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలతో సమానంగా ప్రచారం నిర్వహించినప్పటికీ పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనుకబడిపోయాడని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇక మిగిలిన వారంతా కేవలం పోటీలో మాత్రమే ఉన్నారు.

సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

- కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

కోదాడ : కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు గురువారం జరిగిన ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికి తాను ఎంతో రుణపడి ఉంటానని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులతో పాటు, టీడీపీ, సీపీఐ నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులకు ముఖ్యంగా మహిళలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కోదాడ నియోజకవర్గంలో అందరి సహకారంతో తాను అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరువేస్తామని ఆమె తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతున్నదని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంచి పదవిలో ఉండబోతున్నారని, ఆయన సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో సహకరించిన మీడియా మిత్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వంగవేటి రామారావు, ఈదుల కృష్ణయ్య, బజ్జూరి వెంకటరెడ్డి, కీసర సంతోష్‌రెడ్డి, బూతుక్కూరి వెంకటరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నాటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం పగలు రాత్రి తేడా లేకుండా అహర్నిశలు కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబసభ్యులకు ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, యూత్, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మీ నమ్మకం, మీ ప్రేమ, మీ ఆప్యాయతలు ఎప్పటికీ నా మీద ఇలాగే ఉండాలని ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఆప్యాయత చూపిన ఓటర్లకు ధన్యవాదాలు

- సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆప్యాయత అనురాగాలు చూపిన నియోజకవర్గ ఓటర్లకు అభినందనలు, కృతజ్ఞతలు అని సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీపీఎం జిల్లా, మండల, పట్టణ, గ్రామ నాయకులు, అభిమానులు, సానుభూతిపరులు ఎంతో కష్టపడి గత 20 రోజులుగా తన విజయం కోసం కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు అని తెలిపారు. అంతేకాకుండా తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాండు, యాదగిరిరావు, శేఖర్‌రావు, పల్లె వెంకటరెడ్డి, అనంత ప్రకాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములపై జోరుగా పందేలు



హుజూర్‌నగర్ : అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ముగిసింది. దీంతో వివిధ పార్టీల నాయకుల గెలుపు ఓటములపై చర్చ సాగుతోంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు, టీ స్టాళ్లు తదితర రద్దీ ప్రాంతాలతో పాటు నలుగురు కూడిన చోటే కాకుండా ఎక్కడ చూసినా ప్రస్తుతం ఇదే చర్చ నడుస్తోంది. కొందరు ఒకడుగు ముందేకేసి జోరుగా పందేలు కాస్తున్నారు. నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో మా పార్టీ గెలుస్తది అంటే... మా పార్టీ గెలుస్తుంది.. తమ పార్టీనే అధికారంలోకి వస్తుందని పలువురు పందెంరాయుళ్లు పందేలకు పోతున్నారు. ఒక్కొక్కరూ వారి వారి ఆర్థిక స్థోమతను బట్టి పందెం కాస్తున్నారు. రూ 10 వేల నుంచి లక్షల్లో పందేలు పెడుతున్నారు. మరి కొందరు స్థోమతకు మించి పందేలకు దిగుతున్నారు. వ్యవసాయదారులు అయితే ఎకరాల చొప్పున పొలాలను పందెంలో ఒడ్డుతున్నారు. గతంలో చేసిన అభివృద్ధి వల్ల మా అభ్యర్థి గెలుస్తాడని ఒకరంటే, మా పార్టీ గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని అందుకే ప్రజలు మా పార్టీని గెలిపిస్తారని మరొకరు వాదించుకుంటున్నారు. దీనిపై ఎవరికి వారు తగ్గేదేలే అంటూ సై అంటే సైసై అంటూ జోరుగా పందేలకు దిగుతున్నారు. తమకు అనుకూలమైన, నమ్మకమైన వక్తులను మధ్యవర్తులుగా పెట్టుకుని పందేలకు సై అంటున్నారు. చివరికి గెలుపు ఎవరిని వరిస్తుందో తెలియాలంటే ఈనెల 3 వరకు వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలవబోతుంది

కోదాడరూరల్ : కోదాడలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మావతిరెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేపూరి వెంకటాచారిలు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని గుడిబండలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కోదాడ మండలంలో 5వేల పైచిలుకు మెజార్టీ తమ పార్టీకి వస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

చింతలపాలెంలో అత్యధికంగా పోలింగ్


హుజూర్‌నగర్ : ఓటు వేయడానికి క్యూలైన్‌లో బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో చింతలపాలెం మండలంలో అత్యధికంగా పోలింగ్ 90.27 శాతం నమోదైంది. నేరేడుచర్లలో అత్యల్పంగా పోలింగ్ 81.72 శాతం నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,47,592 మంది ఓటర్లు ఉండగా వారిలో 2,13,702 మంది ఓట్లు వేశారు. వారిలో 1,03498 మంది పురుషులు, 1,08,354 మంది మహిళలు, ఇతరులు 12 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 86.31 శాతం పోలింగ్ నమోదైంది.

మునగాలలో 86.89 శాతం నమోదు

మునగాల : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 22 గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన 44 పోలింగ్ స్టేషన్లలో గురువారం 86.89శాతం పోలింగ్ నమోదైనట్లు అధికార యంత్రాంగం తెలిపింది. మండల వ్యాప్తంగా 35,976 మంది ఓటర్లు ఉండగా వీరిలో 17,653 మంది పురుషులు, 18,323 మంది స్త్రీలు ఉన్నారు.

చిలుకూరులో 87.82 శాతం

చిలుకూరు : మండల వ్యాప్తంగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నిక పోలింగ్ 87.82 శాతం నమోదు అయింది. మండల వ్యాప్తంగా 31,955 ఓటర్లు ఉండగా 28,270 మంది ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

నడిగూడెంలో 88.86 శాతం

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో మండల వ్యాప్తంగా 88.86 శాతం ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దార్ హేమామాలిని శుక్రవారం తెలిపారు. అత్యధికంగా బృందావనపురం, వేణుగోపాలపురం గ్రామాల్లో నమోదు అయ్యాయని, అత్యల్పంగా నడిగూడెంలో ఓట్లు నమోదైనట్లు ఆమె తెలిపారు.

గెలుపు ధీమాలో అభ్యర్థులు

సూర్యాపేట : అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి సూర్యాపేట నియోకవర్గంలో పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉన్నారు. ఏయే వార్డుల్లో ఎవరెవరికి ఎన్ని ఓట్లు వస్తాయోనని వారి అనుచరులతో మీటింగ్‌లు పెట్టుకుని లెక్కలు సేకరిస్తున్నారు. గత ఎన్నికల్లో ఎవరెవరికి ఎక్కడెక్కడ ఎన్ని ఓట్లు వచ్చాయి.. ప్రస్తుతం ఎన్ని వస్తాయి అని అంచనాలు వేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీస్తుందని.. అధికార పార్టీ వ్యతిరేకత తమకు కలిసివస్తుందని కాంగ్రెస్ ధీమాతో ఉండగా.. అధికార పార్టీ మాత్రం తాము చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని భావిస్తోంది. బీజేపీ అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు ఒక్కసారి అవకాశమివ్వాలని కోరడం ప్రజలను ఆలోచించి తమకే ఓటు వేసేలా చేసిందని బీజేపీ నాయకులు పేర్కొంటున్నారు. బీఎస్పీ అభ్యర్థి బడుగు, బలహీన వర్గాలంతా తమ వైపే ఉన్నారని, గెలుస్తాననే ధీమాలో ఉన్నారు.

డబ్బు పంపిణీనే గెలిపిస్తుందా..?

ఎన్నికల్లో ప్రధానంగా డబ్బు పంపిణీయే అభ్యర్థులను గెలుపిస్తుందని జోరుగా చర్చజరుగుతోంది. డబ్బు పంపిణీ చేయలేదని, చేయకున్నా తామే గెలుస్తామని ఆయా పార్టీల అభ్యర్థులు అంటున్నప్పటికీ అందరూ డబ్బు పంపిణీ చేసినట్లు జోరుగా చర్చ నడుస్తోంది. ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి సుమారు 1.40 లక్షల మంది ఓటర్లకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం సాగుతుంది. మరో అభ్యర్థి కూడా అంతకు రెట్టింపు స్థాయిలో డబ్బు పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారని, కానీ వారి అనుచరులు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి. పలు వార్డుల్లో ఓటర్లు డబ్బుల కోసం ఘర్షణలకు దిగినట్లు సమాచారం. మరో ప్రధాన పార్టీ అభ్యర్థి డబ్బు సర్దుబాటు కాకనో.. లేదా గెలుపు ధీమాతోనో కేవలం ఓటుకు రూ.500 మాత్రమే పంపిణీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో అభ్యర్థి కూడా ఓటర్లందరికీ కాకుండా మాస్ ప్రాంతాల్లో రూ.500 చొప్పున పంపిణీ చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ డబ్బు పంపిణీ ధీమాతోనో లేక వారి వారి వ్యక్తిగత ఎజెండాతోనో అభ్యర్థులంతా ఎవరికి వారే గెలుపు ధీమాలో ఉన్నారు.

ఎయిడ్స్‌ను సమూలంగా నిర్మూలించాలి


అనంతగిరి : త్రిపురవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అనంతగిరి : ఎయిడ్స్ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలని త్రిపురవరం వైద్యాధికారిణి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సురక్షితం కాని లైంగిక సంపర్కంతో ఎయిడ్స్ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. సురక్షితం కాని రక్తమార్పిడి ద్వారా కూడా ఎయిడ్స్ వ్యాధి వస్తుందని అన్నారు. హెచ్‌ఐవీ వైరస్ సోకిన వారు ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు వాడి జీవిత కాలాన్ని పెంచుకోవచ్చుని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హరినాథ్, సిబ్బంది రత్నమేరి, కళావతి, విజయకుమార్, శ్రీదేవి, శైలజ, మహేష్, మంజుల, రాధ, మంగ, శైలజ, రమ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి


తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

తుంగతుర్తి : ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ చందనాయక్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సోమన్న, నర్సింహాచారి, జానకమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి కోరారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ తారమ్మ, సూపర్‌వైజర్లు మాణిక్యం, చిన్ని, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషిచేయాలి


అర్వపల్లిలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో పోరాడి ప్రాణాలర్పించిన అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీఎస్ జేఏసీ–ఓయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నోముల వంశీయాదవ్ కోరారు. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీస్ కిష్టయ్య వర్ధంతిని శుక్రవారం అర్వపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం కిష్టయ్య చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దడిపల్లి వెంకట్, దిర్శనపు కృష్ణమూర్తి, పుప్పాల సోమశేఖర్, మర్రిపల్లి సూర్య, మామిడి సోమయ్య, కనుకు మహేష్, అలువాల వెంకటస్వామి, మామిడి శ్రీను, బైరబోయిన మహరాజు, కొమారి శ్రీరాములు, దిర్శనపు యాదయ్య, కొమారి సురేష్, శివ, నాగరాజు, మామిడి సురేష్, కుంభం రాజు, సాయిని మణి, కోటిప్రసాద్, రాంగోపాల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ


కనకదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : కార్తీక మాసం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయంలో శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ, కోటి దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పడిపూజ, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, ధర్మకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి నివాళి


కుమ్మరిగూడెంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి : మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీ ఆవాసం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పిట్టల సైదులు శుక్రవారం మృతిచెందారు. దీంతో అతడి మృతదేహాన్ని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్య యాదవ్ సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఉపసర్పంచ్ శనిగారపు సుశీల సత్తయ్య, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పిట్టల నర్సయ్య, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ గుండె ఈశ్వర్, తొట్ల శ్రీను, అలుగుబెల్లి భాస్కర్‌రెడ్డి, పిట్టల వెంకన్న, మన్నె శివ తదితరులు ఉన్నారు.

చిన్నచూపు చూడొద్దు

హాలియా : హెచ్ఐవీ బాధితుల పట్ల చిన్నచూపు చూడొద్దని ఎంసీఎం డిగ్రీ కళాశాల, ఆల్ఫా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులత అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్–1 విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆల్ఫా జూనియర్, ఎంసీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు కొండల్, ఎన్ఎస్ఎస్ పీఓ సాయి ప్రకాష్ నేత పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ


ప్రింటర్‌ను బహూకరిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

తిరుమలగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పేరం కుమార్, షీల మల్లేష్‌లు రూ.12500 విలువైన వైఫై ప్రింటర్‌ను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దేవరకొండ : రాష్ట్రంలో, దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ఆదరించారన్నారు. 10ఏళ్ల కేసీఆర్ పాలనపై విసుగు చెంది బీఆర్‌ఎస్ పార్టీని రాష్ట్రం నుండి పారద్రోలాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎన్నికల్లో ప్రజల ప్రలోభాలకు లోను చేయాలని చూసినా... దేవరకొండలో ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టారన్నారు. అధికార బలంతో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు చోట్ల కాంగ్రెస్ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని, దీనిని ఆయన ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్, పున్న వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, ఎండీ యూనుస్, లెండాల మోహన్, రుక్మారెడ్డి, బిక్కునాయక్ పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

దేవరకొండ : రానున్న ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం అని దేవరకొండ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అత్యధిక మెజార్టీతో గెలువనుందని అన్నారు. పార్టీని ఆదరించిన ప్రజలకు, పార్టీ గెలుపునకు అహర్నిషలు కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం పక్కా అన్ని ఆయన ధీమా వ్యక్తం చేశారు. చందంపేట మండలం కోరుట్లలో ప్రశాంతంగా పోలింగ్ జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులతో వాగ్వాదానికి దిగి స్థానిక సర్పంచ్ మల్లారెడ్డిపై దాడికి యత్నించారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పీఏపల్లి ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, వల్లపురెడ్డి, మారుపాకల సురేష్‌గౌడ్, టీపీఎస్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.